

# కత్తుల బోను

యామినీ సరస్వతి

చాలా మందికి జీవితం ఓ శాపం! ఏ కొందరికో జీవితం అపూర్వ వరం ...

* * *

'నువ్వు అతనికోసమే బ్రతుకుతున్నావ్.'

భర్త తూటాల్లాంటి మాటలకి విషాదంగా నవ్వింది.

'హాఁ నీకు నవ్వులాటగా వుంది కదూ. నీలాటిదాన్ని చూసే భార్యకి చెలగాటం భర్తకి ప్రాణసంకటం అనేవి వుంటారు- కాకదా! నీకిది ధర్మం కాదు-" అన్నాడు ఆనంద్.

'మీరు ధర్మపన్నాలు వల్లిస్తున్నారా!' అన్నట్టు చూసిందామె.

'నువ్వు నా కట్టుకున్న యిల్లాలివి. నీ చదువు - సంపాదన: అందం - ఆరాధన, ఊహ - ఆనందం అన్నీ నాకే చెందాలి!'

'నేను నీదాన్నే కదా!'

'ఆఁ భౌతికంగా యిక్కడుంటావ్. ఆలోచనలన్నీ 'అతని' చుట్టూ తిరుగుతుంటాయ్-'

'ఇది మీకేం కొత్త! సినిమా హీరోని అభిమానిస్తే నన్ను రంకులాడి అన్నారు- నవలా రచనని అభిమానిస్తే ఆ రచయితకీ నాకు నీచ సంబంధం అంటగట్టారు - మంచి పాటగాడని, చిత్రకారుడనీ అంటే అవాచ్యాలు పలికారు - నీ నోటికి అడ్డేముంది! మీ నిందలకి అదుపేముంది!' నెమ్మదిగా ఒక్కోమాట కూడబలుక్కుంటున్నట్టుగా అందామె.

ఒక్క క్షణంలో ఆమెపై దూకి, ఆ చెంపా యీ చెంపా వాయించి, గొంతు చుట్టూ చేతులు బిగించి, ఆమె వూపిరాడక కొట్టుమిట్టాడుతూ వుంటే కసిగా- కర్కశంగా చేతులు బిగించి .... యింకా బిగుతుగా....

'నమస్తే....'

ఊహ ఉలికిపడి వెళ్ళిపోయింది.

ఆ వచ్చింది.... ఆమనిలా పిలిచింది... అతను.... యీ దర్శణానికి, ఘర్షణకి కారణభూతమైన.... అతను....

మధుమూర్తి....

మంచి అవకాశం చేజారిపోయిన వాడిలా దిగాలుపడిపోయాడు ఆనంద్. మధు నమస్కారాన్ని స్వీకరించలేదు. తిరస్కరించినట్టుగా అవతలి గదిలోకి వెళ్ళిపోయాడు.

మధుమూర్తి ముఖం వాడిపోయింది- వానచినుకు నోచుకోని మరుభూమిలోని మల్లెతీగలా అయిపోయింది. అంతలో శారద ముఖం చూసి శరత్‌చంద్రికకు తపించే చాతకంలా అయింది మనస్సు... హ్లాదినిలా విప్పారింది.

'కూర్చోండి!'

'థాంక్స్!' పొడిగా అంటూ ఆమెవైపు చూశాడు. ఆ చూపులో ఎన్నో ప్రశ్నలు! ఎన్నో కథన కుతూహలాలు.... ఎలా వున్నావ్ అని పలుకరింపుల అలరింపులు

ఆమె నవ్వింది నవమల్లికలా.... నవమాలికలా....

'మామూలే' అంది నెమ్మదిగా.

నాభి కుహరంనుంచి బయలుదేరిన నిట్టూర్పు వేగంగా కదిలి గుండెల్ని తాకి పెదాలదాకా పాకి పైకి రాలేక అక్కడే గుడుగుళ్ళు పడింది. గుండెని మండించింది. నిట్టూర్పు విగిడి విగిడి.... అక్కడే అక్కడే ఆగిపోయింది.

'మీ పాట కచేరీ-'

'ఊహూ వద్దొద్దు- నేనిక పాడను-'

అతను హతాశుడయ్యాడు- 'ఏంటి' అన్నట్టు చూశాడు.

'గొంతులో నొప్పిగా వుంటోంది-'

అది అబద్ధమేనని తెలుసు - అయినా ఆరాటం అంతరంగంతో పోరాటం సాగించి.... 'డాక్టర్ని....' అర్ధోక్తిలో ఆగిపోయింది.

పేలవంగా నవ్విందామె. అబద్ధానికే అల్లాడిపోతున్న అతన్ని చూసి ఆమె గుండె చెరువై పోయింది. ఏ జన్మబంధం యిది? ఎన్నెన్ని జన్మల ఋణానుబంధం యిది! అతనెవరు? తనెవరు? ఎవరికెవరు? ఇద్దరూ ఈ సభ్యసమాజంలో హద్దులెరిగిన మిత్రులు.... ఒక వూరు కాదు-ఒక్క కాలేజీలో చదివినవాళ్ళు కాదు. ఒకచోట ఉద్యోగం చేసినవాళ్ళూ కాదు- ఒకచోట ఉద్యోగం చేసేవాళ్ళూ కాదు. ఒక పేటలో కాపురం వుంటున్నవాళ్లూ కాదు- కేవలం పరిచయం - అది అభిమానంగా మారి ఆత్మీయతారూపం దిద్దుకుంది.

మొదటిసారి కలుసుకున్నది....

అంతర్జాతీయ మహిళా సంవత్సర సందర్భంగా ఏర్పాటైన ఓ సభలో- తనో వక్త- అతనో శ్రోత - అభినందనలు తనకి మామూలే - అలాగే అనుకుంది అప్పుడు - అందచందాలు - చదువు సంస్కారం- కవిత-గానం అన్నీ వున్న



తనకి యిలాంటి అభిమానుల ప్రశంసలు మామూలే - గులాబీలచుట్టూ తిరిగే మామూలు మనుష మధుపాలు - కానీ అతని సంస్కారమే వేరనిపించింది.

మేయర్‌గారి భార్యకి వీడ్కోలు సందర్భంలో తన కచేరీ..., గానానికి ఆనాడు ప్రాణం వచ్చింది.... అంతగా పరవశించి పాడిందానాడు....ఆ పదబంధరమూ అతనిదే.... అతని పదబంధాలు ప్రబంధవాసనలతో వుంటాయి.... అపూర్వంగా ఆత్మీయంగా....

అది మొదలు....

తనతో పరిచయం అతని జీవితానికి చందనచర్చిత.... కావటితే తనకి - తనిసి - ప్రశంసా పరిమళాలతో మురిసి - అభినందన సరసిలో తడిసి - అతని పరిచయం పదాలతో సరదాలు చేయించింది.

ఉపాసి అడిగాడు—

'మీరేం చదువుకున్నారు?'

నెలల తరబడి నేలలో దాగున్న మొలక తొలకరి చినుక్కి భూగర్భాన్ని చీల్చుకుని వెలికివచ్చినట్టుగా యిన్నేళ్లా దాచుకున్న స్వాతిశయం బయటకొచ్చింది వెళ్ళి సర్టిఫికెట్స్ తెచ్చి చూపించింది.

భరతనాట్యంలో డిప్లొమా - సంగీతం గాత్రంలో డిగ్రీ - వీణలో డిప్లొమా - చిత్రలేఖనంలో సర్టిఫికెట్ - లా డిగ్రీ ఇంగ్లీషు - తెలుగు ఎమ్మే - ఫిలాసఫీ ఎమ్మే - హిందీ విశారద - బెంగాలీ - ఫ్రెంచ్ డిప్లొమా కోర్సు సర్టిఫికెట్స్ - కాకతీయ శిల్పం - విజయనగర దేవాలయ వాస్తుశిల్పంలలో ఎం.ఫిల్—

సర్టిఫికెట్స్ చూస్తూనే ఆశ్చర్యపోయాడు - అతనికై విశ్రాంతి మరొకరైతే మూర్ఛపోయేవారేమో!

'ఇన్ని డిగ్రీలు - ఇంత కృషి ఎప్పుడు - ఎలా సాధ్యం?'

'పరిశీలనగా చూళ్లేదా? పదిహే

వేళ్ళతో ప్రారంభమైన డిగ్రీలవేట ముప్ఫై అయిదేళ్ళకి ఆగిపోయింది.... ఈ మధ్య ఇండియన్ ఎకనమిక్ థియరీపై యంఫిల్ చేయాలనుకుని మానేశా....'

'ఎందుకు?'

'నదికి సాగరగామిని అని పేరు- సముద్రుడిని చూశాక - చేరాక యింక పయనం ఏముంటుంది?' అనుకుంది.

'రోజుకి ఎన్నిగంటలు చదివేవారు?'

'నిద్రకి స్నానపానాలకి - భోజనాలకి వదిలేస్తే మిగతా సమయమంతా...."

'ఆకాశమంత ఆకలి - సముద్రమంత దప్పిక అన్నట్టుంది మీ జ్ఞానతృష్ణ-"

'అదేంకాదు- దారి దొరకని మనస్సుకి చదువే ఓ మార్గం అయింది.'

'నిజంగా మీరు శారదే- అపర శారద కాదు-'

'ధన్యోస్మి-'

అదంతా యిప్పుడు గుర్తొచ్చింది. మేఘాలకి వెన్నెల అంచులాగా బతుకు విషాదానికి యీ ఓదార్పులు-

'అలా వున్నారేం?'

'ఎలా?'

'అలా ఆలోచనా లోచనాల గుండా-'

'బ్రతుకు లోతులు అగాధంగా కన్పిస్తున్నాయ్-'

'ఏమిటి మీ జీవనగీతంలో యీ విషాదం-'

ఒక్కసారిగా ఉప్పెనలా వచ్చింది దుఃఖం,

"మధూ!" అలా పిలవాలనిపించింది. ఆత్మీయత పంచుకోవాలనిపించింది. ఇన్నేళ్ళుగా నటిస్తోన్న బ్రతుకు నాటక రంగంపై వేషం విప్పెయ్యాలనిపించింది.

'మధూ! నన్నుగురించి ఏమనుకుంటున్నారు? రెండేళ్ళుగా యీ యింటి గడప తొక్కుతున్నారు - మమ్మల్ని చూళ్లేదా? వీణకి బిగించిన తీగలు విడివిడిగా వుంటాయి. కానీ రాగం పలికించేవేళ కలిసి పలుకుతాయి. కదిలి మోగుతవి, కానీ మా జీవన వీణలు సంసారగీతం శృతిగా పలకవు-

రోజుకో చీర కట్టుకుని-పండుగలకి-బర్త్‌డేలకి పట్టుచీరలందుకుని సింగారించుకుని తిరిగినంతమాత్రాన సుఖంగా వున్నట్టేనా? ఈ ప్రపంచంలో నూటికి తొంభై తొమ్మిది మందికి అనుకూలుడైన భర్త లభించడు. అందరూ సర్దుకుపోయేవారే! హాయిగా వున్నట్టు కనిపించేలా నటించేవారే! ఎదలో కత్తులు కుమ్ముతున్నా- కన్నీళ్ళబదులు - కల్హారమాలికలు విరియించే నటనం స్త్రీలకి సహజం.... ఆ శక్తితోనే ఆసక్తిలేకున్నా బ్రతుకు శకటాలు లాక్కొస్తున్నారు-

నేనూ అంతే!

నే నెలాటి జీవితాన్ని కోరుకున్నాను!

కానీ దక్కిందేమిటి?

మధూ!

మన దేశంలో స్త్రీకి భర్తనెన్నుకునే అవకాశం లేదు. తన నెన్నుకున్న

భర్తతో నమ్మకువి కాపురంచేయాలి.... అంతే-అలగా సేవ చేయాలి. అర్ధాంగిగా బ్రతికే అర్హత లేదు.

ఎవ రంగీకరించినా అంగీకరించక పోయినా పురుషాధిక్యత వున్న యీ సంఘంలో ఏ స్త్రీ సుఖపడ్లేదు.

నా నవ్వులు నిజమనుకుంటున్నావు? నా సంతోషంయదార్థం అనుకుంటున్నావ్? కానీ-

నేను కత్తులబోనులో బ్రతుకుతున్నాను తెలుసా?

ఆయనకి నా అందం కావాలి. అదీ ఆయన ఆనందానికే - నా విద్వత్తువల్ల ఆదాయం కావాలి. అదీ ఆయన భోగాలకే పరిమితం. ఈ చీరలు - ఈ నగలు యీ షోకులు యివన్నీ ఆయన స్టేటస్ సింబల్స్....అవి నా కొరకు- నా తృప్తి కొరకు కాదు. నేను మిసెస్ ఆనంద్‌ని. అంతేకానీ శారదని కాను....

ఎందుకీ దౌర్భాగ్య జీవితం చెప్పు?

ఈ గుప్పెడంత గుండె ఎప్పుడో ఆగిపోయేదే- ఆపేసేదాన్నే. కానీ- నాదంటూ ఓ లోకాన్ని సృష్టించుకున్నాను. అక్కడ నేను సామ్రాజ్ఞిని. నా ఆనందమయ రసమయలోకం నాది. ఆ ఊహాలోకమే నా బ్రతుక్కి ఊపిరి.

కలల్లో జీవించే నాకు కమనీయ మూర్తిలా నువ్వు కన్పించావు నా కవితకి ఆలంబనగా - నా గానానికి ప్రాణంగా- నా చిత్రలేఖనానికి జీవంగా- నా నాట్యానికి రసరాజుగా- నా ఊహలకి ఊపిరిగా అన్పించావు - నదీకన్య సాగరసంగమం చేసినట్లనిపించింది.

ఆలోచనల అమృతమూర్తివి నువ్వే అనిపించావు....'

'నేను వెళ్తున్నాను-'

చప్పున ఊహాల్లోంచి బయటపడింది శారద- అంతా భావనే.

ఆనంద్ ట్రిమ్‌గా తయారై క్లబ్బుకి వెళ్తున్నాడు. ప్రతి రోజూ అతని కది మామూలే.

మధుమూర్తి కూడా లేచి నుంచున్నాడు.

'అతను వెళ్తే నేం-మీరు కూర్చోండి-' అన్నట్లు చూసింది.

'వస్తున్నారా మీరూ?' అడిగాడు ఆనంద్.

'నమస్తే - వెళ్ళొస్తాను' పొడిగా అన్నాడు మధుమూర్తి. ఈరోజు దర్శనం అయిపోయిందన్నట్టుగా.

ఇద్దరూ గడప దాటి - రోడ్డెక్కి- కారెక్కి- కనుమరుగయ్యారు.

నిస్తేజంగా- నిర్జీవంగా- నిరీహంగా- నిశ్చల నేత్రాలతో అలాగే నించుండి పోయింది శారద.... శరత్తు నెరుగని శారద- బ్రతుకుతో కసరత్తు చేస్తోన్న శారద....

* * *

జీవితం చాలామందికి అనుభవించక తీరని శాపం. ఏ కొందరికో బ్రతుకు ఫలించిన వరం....